క్లుప్తంగా

రామాలయంలో గోమాతకు పూజలు



గోపూజలో బీజేపీ నాయకులు

ఓదెల: ఓదెల గ్రామంలోని రామాలయంలో శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా బీజేపీ నాయకులు గోపూజలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు తీర్థాల కుమార్ ఆధ్వర్యంలో గోవులకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. పార్టీ నాయకులు అవుసుల శ్రీనివాస్, డాక్టర్ మల్లేశం, ఎంబాడి కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా యజ్ఞోపవీతధారణ



యజ్ఞోపవీత ధారణలో పద్మశాలీలు

యైటింక్లయిన్‌కాలనీ: రాఖీ పౌర్ణమి సందర్భంగా రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్ కాలనీ పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయంలో శనివారం సామూహిక యజ్ఞోపవీత ధారణ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుమంత్ చార్యులు, కాలనీ పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి సాంబారి రాజేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, రాయమల్లు, ప్రభాకర్, కుమారస్వామి, ఓదెలు, రాజేశం, లక్ష్మణమూర్తి, బిక్షపతి, సత్యనారాయణ, రాజేశం, ప్రభాకర్, రాంమోహన్, చంద్రయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.

వేద పాఠశాలలో..

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని పాండవుల గుట్ట వేద పాఠశాలలో శనివారం సామూహిక యజ్ఞోపవీత ధారణ, గాయత్రి మంత్ర పఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జగత్‌మానీశ్వరస్వామి, సప్తమాతృకలు, నాగదేవత, శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతులు బసవత్తుల రాజమౌళి ఆచార్యులు, ప్రధానాచార్యులు తిప్పర్తి సత్యాచార్యులు, వేద పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పందులను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీరాంనగర్‌లో పందులు మరణించి దుర్వాసన వస్తోందని స్థానికులు మున్సిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి శనివారం మున్సిపల్ కార్మికులతో వాటిని అక్కడి నుంచి ట్రాక్టర్‌లో వేసి తరలించారు. అనంతరం పూడ్చివేశారు. అనంతరం పలు కాలనీలతో పాటు రహదారి వెంబడి కార్మికులతో శుభ్రం చేయించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో శ్రావణమాసం సందర్భంగా ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో శనిపూజతో పాటు పలు పూజలు నిర్వహించారు.

వైభవంగా మార్కండేయ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న పద్మశాలీలు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో శనివారం పద్మశాలీ కులస్తులు మార్కండేయ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. పద్మశాలీల ఆరాధ్యదైవమైన మార్కండేయుడి ఉత్సవ విగ్రహాలను భజనలు, కీర్తనలతో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామికి నీరాజనం పలికారు. కార్యక్రమంలో భాగంగా పద్మశాలీలు ట్రాక్టర్‌పై మగ్గాన్ని అమర్చి చేనేత ప్రదర్శన చేశారు. పద్మశాలీ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



పెద్దపల్లిరూరల్: బీజేపీ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలు



గోదావరిఖని: జీఎంకు రాఖీ కడుతున్న మహిళా ఉద్యోగులు



కమాన్‌పూర్: అన్నయ్యలకు రాఖీ కడుతున్న చెల్లి



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి బీఆర్‌ఎస్ భవన్‌లో..



ఎలిగేడులో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెళ్లు



సుల్తానాబాద్‌లో..



సుల్తానాబాద్‌రూరల్: రాఖీ కడుతున్న చెల్లెలు



జూలపల్లి: రఘువీర్‌సింగ్‌కు రాఖీ కడుతున్న సోదరి



ఫెర్టిలైజర్‌సిటీ: రాఖీ కడుతున్న ఆడపడుచులు



ఓదెల: కొలనూర్‌లో..

రక్షాబంధన్ వేడుకలు

ఆత్మీయతకు, అనుబంధానికి ప్రతీక అయిన రక్షాబంధన్ వేడుకలు జిల్లావ్యాప్తంగా శనివారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అన్నాతమ్ముళ్లకు, అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు. అన్నాతమ్ముళ్లు కట్నకానుకలు అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆటోలు, బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. స్వీటు షాపులు, రాఖీ దుకాణాలు బిజీగా దర్శనమిచ్చాయి.

– సాక్షి నెట్‌వర్క్

గోమయం రాఖీ.. పర్యావరణానికి రక్ష

- ఆవుపేడ, విత్తనాలతో రాఖీల తయారీ
- తర్వాత పంటచేలు, పెరటితోటలకు ఎరువుగా వినియోగం
- గోమయం ఉత్పత్తులు తయారు చేస్తూ అవగాహన కల్పిస్తున్న కర్రె అర్చన



గోమయం ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తూ విక్రయిస్తున్న కర్రె అర్చన

పెద్దపల్లిరూరల్: అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్ రోజున సహజసిద్ధంగా పర్యావరణానికి మేలు చేసే గోమయంతో రాఖీలు తయారు చేసి మార్కెట్‌లో అందుబాటులోకి తెచ్చారు పెద్దపల్లిలో ఉంటున్న ఓదెల మండలం కొలనూరుకి చెందిన కర్రె అర్చన. వశిష్ఠ ఆర్గానిక్స్ ఉత్పత్తుల పేరిట వివిధ రకాల రాఖీలతో పాటు ఇతర పూజా ద్రవ్యాలు (దూప్ స్టిక్స్, అగర్‌బత్తి, సాంబ్రాణి కప్, ప్రమిద) తయారు చేస్తున్నారు. వీటిని వినియోగించడంతో పర్యావరణానికి మేలు చేసిన వాళ్లం అవుతామంటూ ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు.

గోరక్షాబంధన్..

నీకు నేను రక్ష.. నాకు నువ్వు రక్ష అని రక్షాబంధన్ తెలియజేస్తే. సమాజహితం కోసం ధర్మ రక్షణ కోసం గోమాతను రక్షిస్తామని తెలియజెప్పడమే గోరక్షాబంధన్ ఉద్దేశం అని అర్చన పేర్కొంటున్నారు. గోత్రం ఉన్న ప్రతీఒక్కరు గోమాతను కాపాడతామని సంకల్పం తీసుకోవాలని కోరుతున్నారు.

సహజ వనరులతోనే రాఖీలు

సహజ సిద్ధమైన వనరులతోనే రాఖీలు, ఇతర పూజాద్రవ్యాలను తయారు చేసి విక్రయిస్తున్నాం. గోమయంతో పాటు సింధూరం విత్తనాలు, తుమ్మ బంక, సహజరంగుల మిశ్రమం వినియోగించి రాఖీలు సిద్ధం చేశాం. రాఖీ పండగ అనంతరం ఆయా రాఖీలను పంటచేలు, పెరటితోటలు, కుండీల్లో వేస్తే ఎరువుగా ఉపయోగపడుతుంది. అంతేకాకుండా ఆవుపేడ ఎరువుగా ఉపయోగపడితే, అందులో ఉన్న విత్తనాలు మొలకెత్తుతాయి.

– కర్రె అర్చన, ఆర్గానిక్ ఉత్పత్తుల తయారీదారు





ఆవుపేడ, విత్తనాల మిశ్రమంతో తయారు చేసిన గోమయం రాఖీలు

సంక్షిప్త వార్తలు

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకుర్తి: మండంలోని పుట్నూర్, బసంత్‌నగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఆదివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ట్రాన్స్‌కో అదనపు సహాయక ఇంజినీరు మానాల ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక మరమ్మతు పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈఈ కోరారు.

• ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి పూజలు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంతో పాటు కుమ్మరికుంట శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామాలయం, పెద్దాపూర్ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

• శతాధిక వృద్ధురాలు మృతి

ముత్తారం: ముత్తారంలో శనివారం రాత్రి బండ మల్లమ్మ (104) అనే శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. వృద్ధురాలికి కొడుకులు నరసింహారెడ్డి, రాంరెడ్డి, కూతురు వెల్మారెడ్డి రాధమ్మ ఉన్నారు.

• పిడుగుపాటుకు 15గొర్రెల మృతి

మంథనిరూరల్: మంథని మండలం ఖాన్‌సాయిపేట శివారులోని అటవీ ప్రాంతంలో గొర్రెల మందపై పిడుగుపడటంతో 15గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మంచిర్యాల జిల్లా బోథ్ మండలానికి చెందిన కాపరి ఎల్లయ్య తన గొర్రెలకు మేత కోసం వలస వచ్చాడు. శనివారం ఖాన్‌సాయిపేట శివారులోని అటవీప్రాంతంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి పిడుగుపడింది. పిడుగుపాటుకు మందలోని ఒక మేకతోపాటు 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ప్రభుత్వం తనకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు ఎల్లయ్య కోరారు.

• రెన్యూవల్‌కు మూడురోజుల గడువు

పాలకుర్తి: రైతుబీమా పథకం రెన్యూవల్‌కు సంబంధించి 14తో గడువు ముగుస్తుందని, కొత్త పట్టాపాసు పుస్తకం పొందిన రైతులు వెంటనే ఏఈవోలను సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

యువత రాజకీయాల్లో రాణించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: యువత రాజకీయాల్లోనూ రాణించి సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి అవినాశ్ పిలుపునిచ్చారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పెద్దపల్లిలో పతాకం ఆవిష్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, నాయకులు జగదీశ్, రాజు, తిరుమలేశ్, శ్రావణ్, రాహుల్, దేవేందర్, రాకేశ్, అయూబ్, శ్రీనివాస్, మహేశ్, పవన్‌కుమార్, కళ్యాణ్, మధుకర్, అనిల్, నరేశ్ పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులు ఆపాలి

జ్యోతినగర్: ఒకవైపు ఆదివాసీల దినోత్సవం నిర్వహిస్తూనే, మరోవైపు వారిని హననం చేస్తున్న పాలకుల ద్వంద్వ నీతిని ప్రశ్నిద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జుల సత్యనారాయణ రెడ్డి, పెద్దపల్లి డివిజన్ కార్యదర్శి తోకల రమేశ్ కోరారు. ఎన్టీపీసీ ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పాల్గొన్నారు. నాయకులు చంద్రయ్య, రాము లు, శంకర్, వైకుంఠం, రాయమల్లు పాల్గొన్నారు.

ఆదివాసీల జీవితాలు దుర్భరం

ఆదివాసీల హక్కుల సాధనకు ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐక్యంగా పోరాడాలని సమతా సైనికదళ్ రాష్ట్ర నాయకుడు దుర్గం నగేశ్ కోరారు. ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లిలో ఆదివాసీల తోటిసేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సోయం జనార్దన్, గ్రామ పెద్ద ఆత్రం చంద్రయ్య జెండా ఆవిష్కరించారు. నాయకులు పురుషోత్తం, నారాయణ, హరీశ్, సమ్మయ్య, శేఖర్, శంకర్, కుమారస్వామి, శేఖర్, నగేశ్, రమేశ్, పెద్దులు, భూమయ్య, కుమార్, ప్రసాద్, వెంకటేశ్, సోయం శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాస్తవ లాభాల్లో 40శాతం వాటా చెల్లించాలి



గనిపై రక్షాబంధన్ వేడుకల్లో సత్తయ్య

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం గతేడాది సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, వాటిపై 40శాతం వాటా వెంటనే కార్మికులకు అందజేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. జీడీకే–2ఏ గనిపై శనివారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక లావాదేవీలు త్వరితగతిన ఆడిట్ పూర్తి చేసి ఆగస్టులో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సంస్థవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతనెల నిర్వహించిన మెడికల్ బోర్డు సమావేశం రద్దు చేసి హాజరైన వారందనీ అన్‌ఫిట్ చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మహేశ్, సతీశ్, లక్ష్మయ్య, సాంబయ్య, మల్లేశం, నాగేష్, శ్రీకాంత్, వేణు పాల్గొన్నారు.

నెరవేరనున్న దశాబ్దాల కల



నిధులు మంజూరైనట్లు ఎంపీకి పంపిన లేఖ



మార్చిలో 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

- కన్నాలలో ఆర్‌వోబీ నిర్మాణానికి నిధులు మంజూరు
- తీరనున్న రైల్వేగేట్ కష్టాలు
- చొరవచూపిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల బోడగుట్టపల్లి గ్రామశివారులో గల రైల్వేగేటు వద్ద నూతనంగా ఆర్‌ఓబీ నిర్మాణానికి రైల్వేశాఖ నిధులు మంజూరు చేసింది. దీంతో ఉమ్మడి కన్నాలతో పాటు మంథని, రామగుండం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల ప్రజల దశాబ్దాల కల నెరవేరనున్నది. కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో రామగుండం–రాఘవాపురం రైల్వేస్టేషన్ల మధ్యలో బోడగుట్టపల్లి గ్రామ శివారులో రైల్వేగేట్‌తో కొన్నేళ్లుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15ఏళ్లుగా స్థానికంగా రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి మొదలు నియోజకవర్గ ఎంపీల వరకు తరచూ రైల్వేశాఖ ఉన్నతాధికారులకు, కేంద్రమంత్రులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. రైల్వేగేట్‌తో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఎంపీ వంశీకృష్ణ చొరవచూపాలని మార్చిలో సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీ కన్నాల–గోదావరిఖనికి వెళ్లే చుట్టుపక్కల దాదాపు 100 గ్రామాల ప్రజలు రైల్వేగేట్ మూలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక పరిస్థితులను వివరిస్తూ ఏప్రిల్‌లో దక్షిణమధ్య రైల్వే జీఎంకు లేఖ రాశారు. కన్నాల రైల్వేగేట్ వద్ద అండర్‌పాస్ లేదా ఆర్‌వోబీ నిర్మించాలని కోరారు. స్పందించిన రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ గతనెల 28న ఎంపీకి ప్రత్యుత్తరం రాశారు. వాస్తవానికి కన్నాల రైల్వేగేట్ వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి 2020–21లోనే రైల్వేబోర్డు అనుమతి తెలిపింది. అయితే మొదటగా ఈప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మించేందుకు ప్రతిపాదించగా 2023లో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం కాలేమని తెలిపిన నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయిలో రైల్వేశాఖ నిర్మించేందుకు చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఇందుకు గాను రూ.86.12కోట్ల వ్యయం అంచనాతో స్పెషల్ రైల్వే ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసినట్లు వివరించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ టెండరు దశలో ఉందని, వచ్చే 3, 4 ఏళ్లలో బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు రైల్వే జీఎం లేఖలో పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

ఎమ్మెల్యేకు రాఖీకట్టిన మంత్రి సీతక్క



గోదావరిఖని: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌కు రాష్ట్ర మంత్రి సీతక్క రాఖీ కట్టారు. స్వీట్ తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



మంథని: కేక్ కట్ చేస్తున్న నాయకులు



కమాన్‌పూర్‌లో..



యైటింక్లయిన్‌కాలనీ: వేడుకల్లో నాయకులు

మంథని: మంథనిలో స్థానిక జూనియర్ కళాశాల మైదానం ఎదుట జెండా ఎగురవేశారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎరుకల ప్రవీణ్, పెంటరి రాజు, కిరణ్‌గౌడ్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్ పార్టీ జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి కేక్ కట్ చేశారు. యువజన కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మహేశ్ దామోదర్‌రావు, రాజు, చక్రపాణి, తిరుపతిరెడ్డి, సారయ్యనాయక్, శంకర్ పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని సెంటినరీకాలనీలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. శ్రీపాదభవన్‌లో కేక్ కట్ చేశారు. మండల అధ్యక్షుడు రొద్ద బాపన్న, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత్కురి అవినాశ్, పట్టణ అధ్యక్షుడు కాటం సత్యం, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ యువజన దినోత్సవం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రెబల్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ షిర్కె బస్‌స్టాప్ నుంచి తెలంగాణ చౌరస్తా మార్గమధ్యంలో ప్రధాన రోడ్డుపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కమాన్‌పూర్‌కు చెందిన కంక వినోద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు, కుటుంసభ్యుల వివరాల ప్రకారం వినోద్ తన బైక్‌పై కమాన్‌పూర్ నుంచి కాలనీ మీదుగా గోదావరిఖనికి వెళ్తున్నాడు. యైటింక్లయిన్ కాలనీ షిర్కె బస్‌స్టాప్ నుంచి తెలంగాణ రోడ్డు చౌరస్తా మార్గంలో వాయుపుత్ర ఆటో స్టోర్ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో ఖని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఖని టూటౌన్ పోలీసులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి యైటింక్లయిన్‌కాలనీలో ఆవులను అక్రమంగా తరలిస్తున్న పలువురిపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం శుక్రవారం అర్ధరాత్రి షిర్కె బస్‌స్టాప్ వద్ద గల అబ్దుల్ కలాం స్టేడియం ఎదుట ఉన్న వాటర్ ట్యాంక్ కింద నిలిచిన పశువుల్లో రెండు కోడెలను కాలనీ అల్లూరు గ్రామ శివారుకు చెందిన గంట యాకయ్య, గంట సారయ్య, ఆవుల కొమురయ్య మరికొందరితో కలిసి తాళ్లతో బంధించి ఆవులను ట్రాలీలో బలవంతంగా ఎక్కిస్తున్నారు. ఏఎస్సై కృష్ణ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో సదరు వ్యక్తులను గమనించి అదుపులోకి తీసుకొన్నారు. ట్రాలీతో పాటు వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విచారణ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఎవరైనా ఇతరుల పశువులను దండించినా, వాటిని అక్రమంగా తరలించినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.